క్లుప్తంగా

బీఆర్ఎస్ యూత్ కమిటీ ఎన్నిక



బీఆర్ఎస్ నూతన యూత్ కమిటీ సభ్యులు

పెంచికల్‌పేట్: బీఆర్ఎస్ పెంచికల్‌పేట్ యూత్ కమిటీని శుక్రవారం మండల అధ్యక్షుడు బిట్టి శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ కాశిపాక రాజు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల యూత్ అధ్యక్షుడిగా బండి మహేశ్, ఉపాధ్యక్షుడిగా వాసాల రాజవర్ధన్, సిడెం సురేశ్, టొంబిరే శేఖర్, కార్యదర్శిగా పత్రుగా, కోశాధికారిగా నాయిని సాయిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు దేవాజీ, గోపాల్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సమగ్ర కుటుంబ సర్వే



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: మూడు రోజులుగా మండలంలోని అన్ని గ్రామాల్లో కొనసాగిన సమగ్ర కుటుంబ సర్వే శుక్రవారం ముగిసింది. ఆయా గ్రామాల్లో ఉన్న ఇళ్ల సంఖ్యను లెక్కించి ఇంటి యజమాని పేరును స్టిక్కర్‌పై గోడలకు, తలుపులకు అతికించారు. మొత్తం 9916 గృహాలు ఉన్నట్లు ఎన్యూమరేటర్లు నివేదికలు ఇచ్చారు. 119 మంది ఎన్యూమరేటర్లు, 10 మంది సూపర్‌వైజర్లు విధుల్లో పాల్గొన్నారు. సర్వేను ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ దత్తుప్రసాద్, మండల విద్యాధికారి ఆడే ప్రకాశ్ పరిశీలించారు.

ఉచిత విద్యుత్ సద్వినియోగం చేసుకోవాలి



పరిశీలిస్తున్న డీఈ జీవరత్నం

జైనూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గృహజ్యోతి, ఉచిత వ్యవసాయ విద్యుత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ డీఈ జీవరత్నం అన్నారు. శుక్రవారం మండలంలోని మార్లవాయి గ్రామాన్ని సందర్శించి ప్రజలు వినియోగిస్తున్న గృహజ్యోతి, వ్యవసాయ క్షేత్రంలో వినియోగించే త్రిఫేజ్ విద్యుత్ సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ఉచిత విద్యుత్‌ను ప్రజలు సద్వినియోగించుకొని వ్యవసాయ రంగంలో రాణించాలన్నారు. ఆయన వెంట మార్లవాయి మాజీ సర్పంచి కనక ప్రతిభ- వెంకటేశ్వరరావు, ఏఈ సాయికృష్ణ, లైన్‌మాన్ తిరుపతి, గ్రామస్తులు ఉన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

రెబ్బెన: సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని నేర్పల్లి గ్రామంలో సామాజిక అంశాలపై జిల్లా పోలీస్ కళాజాత బృందం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల బారినపడి మోసపోతే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు రాంచందర్, రోహిత్, వెంకటేశ్, చంద్రశేఖర్, రజిత, సంఘవి పాల్గొన్నారు.

నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు

రెబ్బెన: పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారం రెండు రోజులపాట ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపడుతున్నట్లు తహసీల్దార్ రామ్మోహన్‌రావు తెలిపారు. 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే యువతీ యువకులు ఓటు హక్కు కోసం ఫారం నంబర్ 6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్‌వోలు పోలింగ్ కేంద్రాల వద్ద అందుబాటులో ఉంటారని తెలిపారు.

న్యాస్ మాదిరి పరీక్షల పరిశీలన

కెరమెరి: మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఝరిలో కొనసాగిన న్యాస్ (నేషనల్ అచీవ్ మెంట్ టెస్ట్) మాదిరి పరీక్షలను మండల విద్యాధికారి ఆడే ప్రకాశ్ శుక్రవారం పరిశీలించారు. వచ్చే నెలలో నిర్వహించే న్యాస్ ప్రధాన పరీక్షల్లో అధిక గ్రేడ్‌లు సాధించే విధంగా కృషి చేయాలన్నారు. కులగణనలో విధులు కేటాయించని ఉపాధ్యాయులు యథావిధిగా పాఠశాలలకు హాజరు కావాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కూరగాయలకు కేరాఫ్ 'గంగాపూర్'

- సాగులో ఆదర్శంగా నిలుస్తున్న రైతులు
- సీజనల్ వారీగా తోటల పెంపకంతో లాభాలు



మిరప మొక్కలకు నీరు పోస్తున్న రైతు



గంగాపూర్‌లో సాగు చేస్తున్న వంకాయ తోట

రెబ్బెన: బతుకు బండిని లాగేందుకు ఉపాధి కోసం పట్టణాలపై వైపు చూడరు.. స్వయం ఉపాధి కావాలంటూ అధికారుల చుట్టూ తిరగరు. పుట్టిన ఊరిలోనే వ్యవసాయాన్ని నమ్ముకుని ఉపాధి పొందుతున్నారు. అయితే సాధారణ పంటల సాగు చేపడుతూనే కొద్దిపాటి వ్యవసాయ క్షేత్రంలో కూరగాయలు సాగు చేస్తూ.. అధిక లాభాలు పొందుతున్నారు. కూరగాయల సాగుకు గంగాపూర్ కేరాఫ్‌గా నిలుస్తోంది. ఇతర పంటలతో పోల్చితే కూరగాయల సాగుతో లాభాలు అధికంగా ఉంటాయి. దానితో పాటు తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు పొందవచ్చనే విషయాన్ని గుర్తించిన గంగాపూర్ వాసులు కూరగాయాల సాగుకే మొగ్గు చూపుతున్నారు. ఇక్కడ పండించిన కూరగాయలు జిల్లాతో పాటు పక్క జిల్లాలకు సైతం సరాఫరా చేస్తున్నారు.

సీజనల్ వారీగా..

ప్రణాళికబద్ధంగా సీజనల్ వారీగా కూరగాయలను ఎలా పండించాలో గంగాపూర్ గ్రామస్తులకు వెన్నతో పెట్టిన విద్య. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా కూరగాయలు సాగు చేస్తుంటారు. ముఖ్యంగా మిర్చి, టమాట, క్యాబేజీ, చిక్కుడు, వంకాయ, బెండ, క్యాలీఫ్లవర్, ముల్లంగి వంటి కురగాయలను సాగు చేస్తున్నారు. ఇక తీగ జాతుల్లో బీర, కాకర, సోరకాయ, పొట్లకాయ, బుడమకాయలను సాగు చేస్తారు. వీటికి తోడు పాలకుర, తోటకూర, గొంగూర, మెంతి, కొత్తిమీర, పుదీనా, చుక్కకూర, బచ్చలికూర, కరివేపాకు పండిస్తారు. అన్ని సీజనల్‌లో కూరగాయల సాగు కొనసాగించడం ఇక్కడి రైతుల ప్రత్యేకత. రైతులే నేరుగా మార్కెట్‌లో విక్రయించడంతో లాభాలు సైతం అధికంగా వస్తున్నాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వాగే ప్రధాన నీటి వనరు..

గంగాపూర్ గ్రామ రైతులకు గ్రామానికి అనుకుని ప్రవహిస్తున్న వాగే ప్రధాన నీటి వనరుగా మారింది. అనుకుని ఉన్న భూముల్లో కూరగాయల సాగుకు వాగు అత్యంత అనుకూలంగా మారింది. విద్యుత్ మోటర్ల ద్వారా తోటలకు నీటిని మళ్లించి సాగు చేస్తున్నారు. దాదాపు గ్రామంలో 90 శాతం మంది రైతులు కూరగాయాల సాగు చేపడుతుండగా.. 70 శాతం భూముల్లో వాగు ద్వారా నీటిని అందిస్తున్నారు. కొద్దిమంది రైతులు మాత్రమే బోర్లు, పాత కాలం నాటి బావులు ఉపయోగించుకుని సాగు చేపడుతున్నారు.

కూరగాయలు పండిస్తాం



కాలాన్ని బట్టి కూరగాయలు పండిస్తాం. ఏ కాలంలో ఏఏ తోటలను పెంచాలో మా అనుభవమే మాకు నేర్పింది. అనుభవాన్ని బట్టి సీజన్‌లకు అనుగుణంగా టమాట, వంకయ, మిరప, చిక్కుడు, అలసంద, బెండ, బీర, కొత్తిమీర, తోటకూరలను సాగు చేస్తున్నాం.

– మొర్లె ఎంకయ్య, రైతు

అధిక లాభం



ఇతర పంటల సాగుతో పోల్చితే కూరగాయల సాగు లోనే లాభాలు వస్తాయి. తక్కువ భూమిలో ఎక్కువ లాభాలు పొందవచ్చు. సమీపంలో వాగు ప్రవహిస్తుండటంతో మా గ్రామస్తులందరూ కూరగాయల సాగుకే ఎక్కువ ఇష్టపడుతాం.

– లెండుగూరే బాపురావు, రైతు



ముగిసిన ఛట్ పూజలు



కాగజ్‌నగర్‌రూరల్: భక్తిశ్రద్ధలతో కొనసాగిన ఛట్‌పూజలు శుక్రవారం ఉదయం సూర్యోదయంతో ముగిశాయి. పట్టణంలోని ఎస్పీఎం క్రీడామైదానంలో గురువారం సాయంత్రం ఛట్‌పూజలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం ఉదయం భక్తులు కొలను వద్ద దీపాలు వెలిగించారు. సూర్యభగవానునికి ప్రత్యేక పూజలు చేసి బెల్లం, చెరకు, కొబ్బరికాయ, అరటిపండ్లు, పసుపు, అల్లం తదితరాలతో నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీచైర్మన్ కోనేరు కృష్ణారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వాంకిడి: మండలంలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని 33/ 11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఉద యం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కెరమెరి: మండలంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, 33కేవీలో అత్యవసర పనులు నిర్వహిస్తున్నందుకు నిలిపివేస్తున్నామని, విని యోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో నెలవారి మరమ్మతు కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ పట్టణ ఏఈ కమలాకర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కౌటాల: కౌటాల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతు పనులు చేస్తున్నామని విద్యుత్ శాఖ ఏఈ ప్రేమ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రేషన్ బియ్యం పట్టివేత

కౌటాల: మండల కేంద్రంలోని తాటిపల్లి చౌరస్తాలో శుక్రవారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు ఎస్సై మధుకర్ తెలిపారు. సిర్పూర్(టి) మండలం లోనవెల్లి గ్రామానికి చెందిన కార్తీక్ బైక్‌పై అక్రమంగా 1.50 క్వింటాల్ బియ్యంను తరలిస్తుండగా తాటిపల్లి చౌరస్తా వద్ద పోలీసులు వాహనాల్లో తనిఖీల్లో పట్టుకున్నారు. అలాగే కౌటాల మండలం వీరవెల్లి గ్రామానికి చెందిన ఎల్. ప్రకాశ్ టీవీఎస్ ఎక్స్‌ఎల్‌పై 1.50 క్వింటాళ్ల రేషన్ బియ్యంను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఇద్దరి వద్ద నుంచి రూ. 6 వేల విలువ గల మూడు క్వింటాళ్ల బియ్యంను స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వేతనాలు చెల్లించే వరకు పోరాడుతాం



మాట్లాడుతున్న అంబాల ఓదెలు, నాయకులు

రెబ్బెన: బ్లాస్టింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికులకు సింగరేణి యాజమాన్యం వేతనాలు చెల్లించే వరకు టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో పోరాడుతామని తెలంగాణ బొగ్గు గనుల కాంట్రాక్టు కార్మికుల సంఘం బెల్లంపల్లి ఏరియా అధ్యక్షుడు అంబాల ఓదెలు అన్నారు. శుక్రవారం ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీలో పని చేస్తున్న బ్లాస్టింగ్ కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యాజమాన్యం సెమీ స్కిల్డ్ వేతనాలు అందించేంత వరకు కార్మికుల పక్షాన పోరాడుతామన్నారు. 2022 సెప్టెంబర్ 26న సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మిక సంఘాలతో చేసుకున్న ఒప్పందాల ప్రకారం బ్లాస్టింగ్ కార్మికులకు సెమీ స్కిల్డ్ వేతనాలు చెల్లించేందుకు అంగీకరించగా ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు.

బీమా పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్

ఇచ్చోడ: ప్రభుత్వం అందించే బీమా పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ ఉత్పల్‌కుమార్ దామ్ అన్నారు. శుక్రవారం మండలంలోని దుబార్‌పేట్ గ్రామంలో జనసురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి జీవనజ్యోతి, సురక్ష బీమా యోజన పథకాలపై గ్రామస్తులకు నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ ఆధారిత మధ్యతరగతి కుటుంబాల కోసం ప్రభుత్వం తక్కువ ప్రీమియంతో ఎక్కువగా బీమా వర్తించే విధంగా స్కీంలను ప్రకటించిందన్నారు. ప్రతిఒక్కరూ ఇలాంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పొదుపు ఖాతాలు, డిపాజిట్లు, సైబర్ నేరాలపై గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ విజయ్, ఆర్థిక అక్షరాస్యత సంస్థ కౌన్సిలర్లు సంతోష్, ఎస్‌బీఐ సర్వీస్ పాయింట్ నిర్వాహకుడు సాగర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్వేలో కార్యదర్శులదే కీలక పాత్ర

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణన సర్వేలో గ్రామ పంచాయతీలకు చెందిన కార్యదర్శులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలంగాణ గ్రామ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు జోస్‌పల్లి సంజీవ్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మాట్లాడారు. గ్రామాల పరిస్థితులపై సమగ్ర సమాచారం అందిస్తూ సర్వేలో కీలక పాత్రలు పోషిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు పడుతున్న కష్టాలను ప్రభుత్వం గుర్తించి అన్ని రకాలుగా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోర్లకుంట దుర్గ య్య, తదితరులు ఉన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి



పరిశీలిస్తున్న ఎంఈవో హన్మంతు

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. శుక్రవారం మండలంలోని వీరవెల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షను ఆయన పరిశీలించి మాట్లాడారు. ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం, మాట్లాడడం రావాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలన్నారు. డిసెంబర్ 4న నిర్వహించే నేషనల్ పరీక్ష కోసం విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు



స్వీట్లు తినిపించుకొంటున్న నాయకులు



పాల్గొన్న ఎమ్మెల్సీ దండె విఠల్

సాక్షి,నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు కేక్‌కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గోలేటి టౌన్‌షిప్‌లో సింగరేణి బస్టాండ్ వద్ద, కాగజ్‌నగర్ పట్టణంలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్సీ దండె విఠల్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వ ప్రసాద్‌రావు కేక్ కట్ చేసి కార్యకర్తలకు, నాయకులకు తినిపించారు.

బ్యాటరీ ట్రై సైకిల్ అందజేత



బ్యాటరీ సైకిల్ అందజేస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్: ఉట్నూర్ ఐటీడీఏ మాజీ చైర్మన్, గోండు రత్న అవార్డు గ్రహీత సిడాం అర్జుకు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే బ్యాటరీ ట్రై సైకిల్‌ను శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అందజేశారు. వికలాంగుడైన అర్జుకు కలెక్టర్ ఫండ్ నుంచి రూ. 50 వేల విలువ చేసే ట్రై సైకిల్ అందజేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

ఆసిఫాబాద్‌అర్బన్: గత సంవత్సర కాలంలో జిల్లాలో నిర్వహించిన ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో సేవలు అందించిన వారికి చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని బాధితులు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆసిఫాబాద్‌లో జరిగిన ఎన్నికలకు సంబంధించిన భోజన వసతి కల్పించిన వారికి రూ. 18లక్షలు, వీడియోగ్రాఫర్స్‌కు రూ. 15 లక్షలు, పెట్రోల్, డిజిల్ పోసిన బంకు యజమానికి రూ. 17 లక్షలు, కంప్యూటర్ దుకాణదారుడికి రూ. 13 లక్షలు, వాహనాలు ఏర్పాటు చేసిన వారికి రూ. 7.5 లక్షలు పెండిగ్ బకాయిలు ఉన్నాయన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాధితులు సుదర్శన్, వంశీ, గండ సోను, తిరుపతి, సలీం పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న రాజమల్లు

రెబ్బెన: క్రీడలతో క్రీడాకారుల మధ్య స్నేహభావం పెరుగుతుందని బెల్లంపల్లి ఏరియా ఎస్వోటూ జీఎం రాజమల్లు అన్నారు. శుక్రవారం గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో క్రికెట్ పోటీలను ప్రారంభించారు. క్రీడలు శారీరకంగా, మానసికంగా ఉత్సాహాన్ని ఇవ్వడమే కాక పలు ప్రాంతాలకు చెందిన క్రీడాకారుల మధ్య స్నేహభావం పెరుగుతుందన్నారు. సింగరేణిలో పని చేసే క్రీడాకారులు కోల్ ఇండియా స్థాయి పోటీల్లో సత్తా చాటేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. పోటీల్లో ఖైరిగూడ పీవో జట్టుపై ఎస్వోటూ జీఎం జట్టు 2 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ కార్యక్రమాల్లో పర్సనల్ మేనేజర్ తిరుపతి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్, జనరల్ కెప్టెన్ చంద్రకుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

26న 'ప్రజా రగ్‌జోల్' యాత్రపై సమావేశం



మాట్లాడుతున్న రూప్‌లాల్

కెరమెరి: మండల కేంద్రంలో ఈనెల 26న 'ప్రజా రగ్‌జోల్' యాత్రపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు సేవాలాల్ సేనా జిల్లా అధ్యక్షుడు రూప్‌లాల్ నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడారు. బంజారా ప్రజలకు ఉన్న సమస్యలను తెలుసుకునేందుకు 9 జిల్లాల గుండా ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. జనవరి 12న కుమురం భీం జిల్లాలోకి యాత్ర ప్రవేశిస్తుందన్నారు. జిల్లాలోని తండావాసులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. నాయకులు గుగులోత్ రవి, జరుపుల తిరుపతి, రాథోడ్ శేషారావు, బలిరాం నాయక్, జాటోత్ రవి, అజ్మీర తిరుపతి, చౌహాన్ కిషన్, బానోత్ సుభాష్, సాయి, కిరణ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు



సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ యాదగిరి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన అండర్ 19 జోనల్‌స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో విక్కీ, చైతన్య, సాయికుమార్, గోపాల్, అజయ్, రాకేశ్, రాఘవన్ ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 8 నుంచి 10 వరకు మంచిర్యాల జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు.